క్లుప్తంగా

ఎంపీపీగా అక్కి లక్ష్మిదేవి బాధ్యతలు



బాధ్యతలు స్వీకరించిన ఎంపీపీ అక్కి లక్ష్మీదేవి

ఒంటిమిట్ట : మండల ఎంపీపీ అక్కి లక్ష్మిదేవి తన మూడు నెలల సెలవు అనంతరం సోమవారం తిరిగి ఎంపీపీగా బాధ్యతలు తీసుకున్నట్లు ఒంటిమిట్ట ఎంపీడీఓ జె.సుజాత తెలిపారు. గడిచిన మూడు నెలలు పాటు గత వైస్ ఎంపీపీ-1 ఎన్నికల్లో విజేతగా నిలిచిన నల్గొండ లక్ష్మిదేవి ఇన్‌చార్జ్ ఎంపీపీగా బాధ్యతలు చూశారన్నారు. ప్రస్తుతం ఒంటిమిట్ట ఎంపీపీ అక్కి లక్ష్మిదేవి బాధ్యతలు స్వీకరించడంతో నల్గొండ లక్ష్మిదేవిని వైస్ ఎంపీపీ-1గా కొనసాగుతారని చెప్పారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్ అందజేస్తున్న రామకృష్ణయ్య

నందలూరు : మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లె గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కుప్పాల రామకృష్ణయ్య సోమవారం కంప్యూటర్ వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం అందరికీ అవసరమని కంప్యూటర్ అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణని పూలమాల, శాలువాతో ఉపాధ్యాయ, విద్యార్థుల బృందం సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రఘుప్రసాద్, నిత్యపూజయ్య, సాహెబ్‌జాన్, సుబాయతుల్లా, ఆయేషా పర్వీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతలమయమైన జాతీయ రహదారి



రహదారిపై గుంతల్లో నిలిచివున్న వర్షపునీరు

పుల్లంపేట : కడప - చెన్నై జాతీయ రహదారి అనంతంపల్లి వద్ద ఆదివారం కురిసిన కొద్దిపాటి వర్షానికి రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. తిరుపతి నుంచి కడపకు వెళ్లేటప్పుడు జాతీయ రహదారిపై నిలిచి ఉన్న నీరు ఇండ్లలోకి ఎగిసిపడుతున్నాయి. దీంతో ఇంటి యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

నివాళి



ధీరజ్ రెడ్డి సమాధివద్ద నివాళులు అర్పిస్తున్న కుటుంబసభ్యులు

ఒంటిమిట్ట : మండల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టక్కోలి శివారెడ్డి తనయుడు టక్కోలి ధీరజ్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం నడింపల్లి వద్ద ఉన్న ధీరజ్ రెడ్డి సమాధి వద్ద ఒంటిమిట్ట మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ధీరజ్ రెడ్డి సమాధి వద్ద కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పూలమాలలు వేసి మౌనం పాటించారు. అనంతరం తన కుమారుడి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, గజ్జల శ్రీనివాసులు రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుట్రలో భాగంగానే ఎంపీ అరెస్టు



చీర్ల నాగమ్మ, ఎంపీపీ

ఓబులవారిపల్లె : కూటమి ప్రభుత్వం కుట్రలో భాగంగానే రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం జరిగిందని ఎంపీపీ చీర్ల నాగమ్మ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు.

ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజలు గర్వపడేలా ప్యానల్ స్పీకర్ స్థానంలో ఉన్న ఆయన్ను అరెస్టు చేయడం కూటమి కుతంత్రమేనన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కోలేక కూటమి నాయకులు నీచ రాజకీయాలకు తెరలేపారన్నారు. రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనబెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుండటం సిగ్గుచేటని అభివర్ణించారు.

రోగాలొస్తాయ్ జాగ్రత్త..!

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- దోమలతో మలేరియా, డెంగ్యూ జ్వరాలు
- నీరు, కలుషిత ఆహారంతో డయేరియా
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాంతకం



మురికికుంటలో గంబూసియా చేపలను వదులుతున్న వైద్య సిబ్బంది (ఫైల్)

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముంది. పారిశుధ్య లోపం, నీటి నిల్వలతో రోగాలు వ్యాపించే అవకాశం ఉంది. దోమలు వృద్ధి చెంది దోమకాటు వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు, కలుషిత నీరు, కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల టైఫాయిడ్, కామెర్లు వంటి వ్యాధులు సోకే అవకాశం ఉంది. వీటితో పాటు వైరల్ జ్వరాలు పొంచి ఉన్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండి పలు జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధులు విజృంభించే ఆస్కారం లేకపోలేదు. వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవడం వల్ల వ్యాధులు సోకకుండా బయటపడవచ్చని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే జ్వర పీడితులు ఆసుపత్రులకు వెళ్లి మందులు పొందుతున్నారు. డెంగ్యూ, మలేరియా లక్షణాలు ఉన్న వారికి అనుమానంతో రక్తపరీక్షలు సైతం చేస్తున్నారు.

డెంగ్యూ ప్రమాదకరం

ఏడీస్ ఈజిప్ట్ అనే ఆడదోమ ద్వారా డెంగ్యూ వ్యాప్తి చెందుతుంది. ఈ దోమలు పగటిపూట ఎక్కువగా కుడుతాయి. డెంగ్యూ వైరస్‌లో ఇన్‌ఫెక్ట్ అయిన దోమలే కాకుండా గుడ్లలో కూడా ఈ వైరస్ ఉంటుంది. కాబట్టి త్వరగా ఎక్కువ మందికి వ్యాపించే అవకాశం ఉంటుంది. ఈ దోమ మంచినీటిలోనే గుడ్లు పెడుతుంది. ఏడీస్ దోమకాటు తర్వాత 3 నుంచి 14 రోజుల్లో డెంగ్యూ వచ్చే అవకాశం ఉంది. ఆకస్మికంగా జ్వరం, విపరీతమైన కండరాలు, కీళ్లు, కళ్ల నొప్పులు, వాంతులతో డెంగీ మొదలవుతుంది. కొంత మందికి శరీరంపై ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తస్రావం అవుతుంది. ఈ వ్యాధి బారిన పడిన వారిలో 80 శాతం మందికి దానంతట అదే తగ్గిపోతుంది. దద్దుర్లు వచ్చిన సమయంలో రక్తంలో ప్లేట్‌లెట్స్ తగ్గినా తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయి. హెర్రైజ్, షాక్ సిండ్రోమ్ సోకిన వారిని ఆసుపత్రిలో చేర్పించాల్సి ఉంటుంది. డెంగ్యూ నిర్ధారణకు మొదటి వారంలో ర్యాపిడ్ కిట్‌తో పరీక్ష చేస్తారు. రెండో వారంలో తీవ్రతను బట్టి ఎలీసా పరీక్ష నిర్వహిస్తారు. డెంగ్యూ పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుంది.

మలేరియా పట్ల అప్రమత్తత అవసరం

అనాఫిలస్ అనే దోమకాటు ద్వారా మలేరియా జ్వరం వస్తుంది. ఈ జ్వరం సోకిన వారికి చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం సోకుతుంది. ప్లాస్మోడియా జాతికి చెందిన రెండు రకాల క్రిముల వల్ల మన ప్రాంతంలో మలేరియా వస్తుంది. వైవాక్స్ మలేరియా అంత తీవ్రం కాకపోయినప్పటికీ ఎక్కువ కాలం బాధిస్తుంది. ఫాల్సీఫారం ప్రాణాంతకం కావచ్చు. చికిత్సతో పాటు నివారణ చర్యలు కూడా మంచి ఫలితాలను ఇస్తాయి. గర్భిణులు, చిన్నపిల్లలు ఈ వ్యాధి తీవ్రతకు ఎక్కువగా గురవుతారు. జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్ష చేయించుకుని నిర్ధారించుకోవాలి. మలేరియా రకాన్ని బట్టి వైద్యుల సూచన మేరకు పూర్తి మోతాదులో చికిత్స పొందాలి. నీటినిల్వలో పెరిగే అనాఫిలిస్ దోమకాటు నుంచి రక్షణ పొందటం ఉత్తమం.



సీజనల్ వ్యాధులపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

టైఫాయిడ్

కలుషిత ఆహారం, కలుషిత నీరు తీసుకోవడం వల్ల ఈ వ్యాధి వ్యాపించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఈ వ్యాధి సాల్మోనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. తీవ్రమైన జ్వరం, కొద్దిగా దద్దుర్లు, చిన్న పిల్లల్లో విరేచనాలు, పెద్దవారిలో మలబద్ధకం, కడుపులో నొప్పి, తలనొప్పి, ఆకలి లేకుండా ఉండటం జరుగుతుంది. ఈ వ్యాధి సోకిన వారిలో 10 శాతం మంది తీవ్రస్థాయికి చేరుకునే అవకాశం ఉంది. వారిలో పేగుల్లో పుండ్లు పడి రక్తం స్రవించడం ద్వారా తీవ్ర అస్వస్థతకు గురవుతారు. మెదడు, గుండెకు సంబంధిత వ్యాధులు కూడా రావచ్చు. బాధితులు సకాలంలో వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స పొందాలి.

డెంగ్యూకు సకాలంలో చికిత్స అవసరం



జ్వరం సోకినప్పుడు అశ్రద్ధ చేయకుండా నిపుణులైన వైద్యుల వద్దకు వెళ్లి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. డెంగ్యూ పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం సంభవిస్తుంది. డెంగ్యూ సోకిన వారిలో 20 నుంచి 30 మందిలో ప్లేట్‌లెట్స్ తగ్గి సీరియస్ అయ్యే అవకాశం ఉంది. అధిక జ్వరం, ఒళ్లు నొప్పులు ఎక్కువగా ఉంటాయి. జ్వరం వచ్చినప్పుడు ఫ్లూయిడ్స్ ఎక్కువగా తీసుకోవాలి.

- డాక్టర్ ఏసీ రాజ్, ప్రముఖ వైద్యులు, రాయచోటి

ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రస్తుత వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంది. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు విస్తృత అవగాహన, ముందస్తు చర్యలపై వివరిస్తున్నాం. వ్యాధి రాకుండా చూడటం మేలు. బయటి ఆహార పదార్థాలు తినకుండా ఇంట్లో తయారుచేసిన ఆహారం తీసుకోవాలి.

- డాక్టర్ డేవిడ్ సుకుమార్, సూపరింటెండెంట్, రాయచోటి ప్రాంతీయ వైద్యశాల

పెద్దిరెడ్డిని కలిసిన జిల్లా వైఎస్సార్‌సీపీ నేతలు



రాజంపేట : మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన స్వగృహంలో సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా నేతలు కలిశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, రైతు నేత ప్రసాద్‌రెడ్డి తదితరులున్నారు. ఇటీవల మిథున్ రెడ్డిని అక్రమ అరెస్టు చేసిన నేపథ్యంలో ఆయన తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి చర్చించారు.

ప్రజల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా?

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ ప్రజల తాగునీటి కష్టాలు ప్రభుత్వానికి పట్టవా అని సీపీఐ (ఎంఎల్) అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ ఆరోపించారు. రాయచోటిలోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయచోటి మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తుండటంతో తాగునీటి సమస్య తీవ్రంగా మారిందన్నారు. ఈ సమ్మె సుమారు 10 రోజులుగా జరుగుతోందని చెప్పారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి సారించి తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అక్రమ అరెస్టులకు భయపడేదిలేదు

రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి



పెనగలూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచకాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని, ఏ తప్పు చేయని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని మద్యం కుంభకోణం అని చూపుతూ అరెస్టు చేశారని రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి ఆరోపించారు. సోమవారం సాయంత్రం ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. పెద్దిరెడ్డిలో ఉన్న రాజకీయ వైరంతోనే సీఎం చంద్రబాబు నాయుడు రాజంపేట ఎంపీని అరెస్టు చేయించి కక్షసాధింపు చర్యలకు దిగారన్నారు. మిథున్‌రెడ్డి ప్రజల మనిషి అని, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు ఆయన నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. అలాంటి నాయకుడిని అరెస్టు చేసి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయభ్రాంతులకు గురి చేయాలనే పన్నాగం రూపొందించారన్నారు. ఇలాంటి అక్రమ అరెస్టులకు వైఎస్సార్‌సీపీ కార్యకర్త కూడా భయపడేది చంద్రబాబు గుర్తుంచుకోవాలని తెలియజేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే మంత్రి నారా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎల్లో పత్రికలను అడ్డం పెట్టుకొని ప్రజల మెదళ్లలో చిమ్ముతున్న విష ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో చంద్రబాబుకు సరైన రీతిలో ప్రజలు సమాధానం చెబుతారని, అలానే కూటమి పార్టీల అకృత్యాలు, రాజకీయ అరెస్టులను ప్రజల్లో ఎండగడతామని తెలియజేశారు.

రెడ్లపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు



గుండు మల్లికార్జునరెడ్డి

నందలూరు : కూటమి ప్రభుత్వం రెడ్డి సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని పరుష పదజాలంతో దూషిస్తూ కక్షసాధింపు చర్యలకు దిగుతోందని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ జిల్లా ప్రచార కార్యదర్శి గుండు మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత 13 నెలలుగా కూటమి ప్రభుత్వం ఎలాంటి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేయకపోగా, రాష్ట్రంలో ఉన్న రెడ్డి సామాజికవర్గాన్ని లక్ష్యంగా చేసుకుని కూటమి ప్రభుత్వం, పార్టీల నాయకులు కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని అన్నారు. రెడ్డి సామాజికవర్గాల మనోభావాలు దెబ్బతీసేలా పరుష పదజాలంతో దూషిస్తూ చేస్తున్న వికృత చేష్టలను రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఖండిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించడంతో పాటు ఇళ్లపై దాడి చేస్తున్నారని తెలిపారు. రెడ్ల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తే కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించేంత వరకు తాము పోరాడుతామన్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే మిథున్‌రెడ్డి అరెస్టు



భూమన శివశంకర్‌రెడ్డి

రాజంపేట : ఎలాంటి స్కామ్ లేదని తెలిసినా, కక్షపూరితంగానే పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారని, రెడ్‌బుక్ పేరుతో ప్రతిపక్షాన్ని భయభ్రాంతులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమన శివశంకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన కన్నా, వైఎస్సార్‌సీపీ నేతలు టార్గెట్ చేసి అరెస్టు చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయంగా ఉందని ఎద్దేవా చేశారు. రాజకీయ దురుద్దేశంతో తప్పుడు విచారణలు, అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు. వీటికి వైఎస్సార్‌సీపీ బెదరబోదన్నారు. బూటకపు వాగ్దానాలు, సూపర్‌సిక్స్ పథకాలు అంటూ జనాన్ని నట్టేటా ముంచి, అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వంపై జనంలో యేడాదిలోనే తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. టీడీపీ పాలన ఇలాగే కొనసాగితే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

మసీదు అక్రమ నిర్మాణాన్ని ఆపాలంటూ వినతి



మసీదు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మహబూబ్‌చాంద్

సుండుపల్లె : అనుమతులు లేకుండా అక్రమంగా చేపడుతున్న మసీదు నిర్మాణాన్ని ఆపాలని జిల్లా కలెక్టర్‌కు రాజంపేట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామ జగదీష్ స్వామి వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోని అక్కంపల్లె జగనన్న కాలనీలో పేదవారి ఇండ్లకు స్థలాలు ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందన్నారు. అయితే అక్కడ కొందరు వ్యక్తులు హిందువులు ఉన్న ప్రాంతంలో వారి ఇండ్ల మధ్యలో అనుమతులు లేకుండా మసీదు నిర్మాణాన్ని అక్రమంగా చేపడుతున్నారని స్థానికులు రామజగదీష్ స్వామి దృష్టికి తీసుకుపోవడంతో ఆయన సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ వెంటనే మండల తహసీల్దార్ మహబూబ్‌చాంద్‌కు ఫోన్ ద్వారా తెలియజేసి క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది ఇండ్ల మధ్యలో మసీదు నిర్మాణం చేపట్టరాదని వెంటనే ఆపివేయాలని నిర్మాణదారులకు సూచించారు.



మాధవరం-1లో ఖాళీ బిందెలతో మహిళల నిరసన

నీటి కోసం నిరసన

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పార్వతీపురం, రామక్రిష్టాపురం, వెంకటేశ్వరపురం గ్రామాలల్లో తాగునీరు రాకపోవడంతో సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మా గ్రామాలకు సిద్దవటం పెన్నా నది నుంచి వస్తున్న తాగునీరు గత మూడు రోజులుగా రావడంలేదన్నారు. దీంతో తాగునీరు కొనుగోలు చేసి తాగుతున్నామన్నారు. గ్రామ పంచాయతీలో తరుచూ తాగునీటి సమస్య తలెత్తుతోందన్నారు. ఈ సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. లేదంటే గ్రామ సచివాలయాన్ని ముట్టడిస్తామని మహిళలు హెచ్చరించారు.

25న జర్నలిస్టులకు ఉచిత కంటి వైద్యశిబిరం

రాజంపేట రూరల్ : ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఈ నెల 25వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఏపీయూడబ్ల్యూజే తాలూకా అధ్యక్షులు ఇండ్లూరి చిన్న వెంకటరెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బచోటి భాస్కర్‌లు తెలియజేశారు. స్థానిక ఆర్అండ్‌బీలో సోమవారం జర్నలిస్టుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి వద్దనున్న అరవింద్ కంటి వైద్యశాలలో నిర్వహించే ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వర్కింగ్ జర్నలిస్టులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజంపేటతో పాటు పరిసర మండలాలలో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మందా శివయ్య, కోశాధికారి సునీల్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీహరి, ప్రతినిధులు ఉదయగిరి కళ్యాణ్, నాగేంద్రప్రసాద్, నరసింహ, రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీలను పరిష్కరించండి



తహసీల్దార్‌కు అర్జీ అందజేస్తున్న ప్రజలు

పెనగలూరు : మండలం నుంచి గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ అమరేశ్వరీ అన్నారు. సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా వీఆర్‌ఓలతో ఆమె సమావేశం నిర్వహించారు. మండల నలుమూలల నుంచి బాధితులు పలు సమస్యలపై అర్జీలు అందించారు. ఈ అర్జీలపై విచారణ జరిపి వెంటనే పరిష్కరించేందుకు ప్రతి వీఆర్‌ఓ కృషి చేయాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌లో ఎక్కువగా రెవెన్యూ సమస్యలే వస్తున్నాయని వీఆర్‌ఓలు నేరుగా సమస్య ఉన్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించి విచారించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

హరిహర సుతుడుకి అభిషేకాలు



అలంకరణలో దర్శనమిస్తున్న అయ్యప్ప

రాజంపేట రూరల్ : రాజంపేట - తిరుపతి రహదారి మణికంఠ నగర్‌లోని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో సోమవారం హరిహర సుతుడు శ్రీఅయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకములను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. గత 40 రోజుల నుంచి చేపట్టిన మండల పూజలు నేటితో ముగిశాయి. ముందుగా అయ్యప్పస్వామికి అష్టాదశ కలశాభిషేకం చేసి సుందరంగా అలంకరించారు. ఇదే సమయంలో అయ్యప్పస్వామికి హోమ పూజలు జరిపారు. అదే విధంగా షిరిడి సాయిబాబ పునః ప్రతిష్ట పూజలను వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు తుమ్మలపెంట పాలప్రకాష్, దేవస్థాన గురుస్వామి కొండా సత్యనారాయణ, దేవస్థాన పూజారి కొత్తపల్లి రాఘవేంద్రశర్మ, ధర్మకర్తలు రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కే.దాము ఆచారీ, రమేష్‌బాబు, సుధాకర్, పులి కృష్ణ, వెంకటసుబ్బయ్య ఆచారి, భక్తులు పాల్గొన్నారు. పూజలలో పాల్గొన్న భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు.

మానసికోల్లాసంతో ఆరోగ్య సమస్యలు దూరం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్ : ప్రస్తుతం అందరిది ఉరుకులు, పరుగులమయమైన జీవనం అయ్యిందని అందువల్ల ప్రతి ఒక్కరూ మానసికోల్లాసాన్ని పొందడం ఎంతో అవసరమని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని తిరుపతి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వసుందర అండర్ వాటర్ ఆక్వా అవతార్ ఎగ్జిబిషన్‌ను మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట వంటి చిన్నపట్టణంలో ఇక్కడి ప్రజలకు మంచి అనుభూతిని కల్పించేందుకు వాటర్ ఆక్వా అవతార్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించడం ఎంతైనా అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి ఎగ్జిబిషన్‌ల వల్ల పిల్లల్లో ఆలోచన శక్తి కూడా పెంపొందుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. బాహ్యాప్రపంచం గురించి పిల్లలకు తెలియచేయాలన్నారు. అలాగే పెద్దలు కూడా ఎప్పుడు పని ధ్యాసలోనే ఉండకుండా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జెనుగు కృష్ణారావుయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, వివిధ విభాగాల కన్వీనర్లు పోలి శివయ్య, దండు గోపి, ఖాజామొహిద్దీన్, జాహీద్ అలీ, అబ్దుల్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

జడ్‌హెచ్‌డీసీ భూ సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు సమస్యను తెలియజేస్తున్న రైతులు

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు రెవెన్యూ పరిధిలోని జడ్‌హెచ్‌డీసీ భూముల సమస్యలు పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ యామినీ రెడ్డికి రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జడ్‌హెచ్‌డీసీ భూములు తమ పేరు మీద ఉన్నాయని, తమ భూములు కబ్జాలకు గురవుతున్నాయని చెప్పారు. జడ్‌హెచ్‌డీసీ భూములు పేద దళితులు సాగు చేసుకునేందుకు ఇవ్వడం జరిగిందని, అయితే కోట్ల రూపాయల భూములను అక్రమంగా ఆక్రమించి అమ్ముకుంటున్నారని వారు ఆరోపించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఇందుకు తహసీల్దార్ స్పందిస్తూ న్యాయస్థానంలో వ్యాజ్యం ఉన్న భూముల వ్యవహారం న్యాయస్థానం ద్వారానే పరిష్కరించుకోవాలని తక్కిన రైతులకు సంబంధించిన భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ రామ్మోహన్ రెడ్డి, ఆర్‌ఐ మల్లికార్జున రెడ్డి, వీఆర్‌ఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి



జేసీకి ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణం గున్నికుంట్ల రోడ్డులోని ఇనాయత్‌ఖాన్ చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ రాయచోటి రింగ్ రోడ్డు పక్కన ఉన్న ఇనాయత్‌ఖాన్ చెరువు సర్వే నెంబర్ 509లో కొంత మందికి మిలిటరీ పట్టా ఉందని ఆ చెరువులోనే మట్టితో దాదాపు 2 ఎకరాలు తయారు చేసి ఎటువంటి అనుమతులు లేకుండా చెరువును చదును చేశారన్నారు. అదే కాకుండా అక్రమ లేఔట్లు ఏర్పాటు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుమిత్ర, సీపీఐ పట్టణ నాయకులు రామ్మోహన్‌లు పాల్గొన్నారు.

అప్రమత్తంగా లేకుంటే ఆస్పత్రికే..



రోడ్డు మధ్యలో సన్నటి గుంత వల్ల అదుపు తప్పుతున్న ద్విచక్ర వాహనం

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి అర కిలోమీటరు దూరంలో సన్నపాటి గుంత
- వాహనం అదుపుతప్పి గాయాలపాలవుతున్న వాహనదారులు

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి మన్నూరు వరకు రోడ్డుకు మధ్యలో సన్నటి గుంతతో పాటు మధ్య, మధ్యలో గుంతలు ఉండటం వల్ల నిత్యం ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి వాహనదారులు కిందపడి గాయాల పాలవుతున్నారు. ఈ మార్గంలో నిత్యం పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. అక్కడ వన్‌వే విధానం ఉండటం వల్ల చాలా మంది వాహనదారులు రోడ్డుకు మధ్యలోనే వెళుతుంటారు. అయితే ఆ ప్రాంతంలో రోడ్డుకు మధ్యలో సన్నపాటి గుంత ఉండటం తెలియని వాహనదారులు వాహనాన్ని కొద్దిపాటి వేగంతో నడిపినా అదుపు తప్పి కింద పడి రక్త గాయాలపాలవుతున్నారు. ప్రతి రోజు కనీసం నలుగురైదుగురు ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడుతున్నట్లు ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. అయితే ద్విచక్రవాహనం అదుపు తప్పి వాహనదారుడు కింద పడే సమయంలో వెనకవైపు నుంచి పెద్ద వాహనాలు వస్తే ప్రాణాలు పోయే ఆస్కారం లేకపోలేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధితశాఖ అధికారులు స్పందించి రోడ్డుకు మధ్యలో ఉన్న సన్నటి గుంతను సరిచేయడంతో పాటు మధ్య, మధ్యలో ఉండే గుంతలను పూడ్చివేయాలని వాహనదారులు కోరుతున్నారు. లేకుంటే ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే అందుకు అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని ఇటు ప్రజలు అటు వాహనదారులు హెచ్చరిస్తున్నారు. సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనలకు కూడా దిగనున్నట్లు వాహనదారులు తెలిపారు.



ప్రమాదాలకు కారణమవుతున్న సన్నపాటి గుంత